క్లుప్తంగా

10న మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీన ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గంగాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల హాజరు


హాజరైన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 మంది అధికారులు హాజరయ్యారు. వారం రోజుల క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలం ఒక అధికారి మాత్రమే హాజరు కావడంతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. తహసీల్దార్ సోమశేఖర్ సైతం రాబోవు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరు కాని అధికారులపై చర్యల్లో భాగంగా నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 22 మంది అధికారులకు గాను 12 మంది హాజరయ్యారు. గైర్హాజరైన 10 శాఖల అధికారులకు నోటీసులు పంపుతామని తహసీల్దార్ తెలిపారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి


మాట్లాడుతున్న బి.శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు జగ్గిలిరమేష్, కసాపురం రమేష్, సురేంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెన్నపూస వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యాడికి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వెన్నపూస వెంకటరామిరెడ్డి నియమితులయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు తదితరులు వెన్నపూస వెంకటరామిరెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీసీ మల్లికార్జున, రామాంజనేయులు, రామకృష్ణ, శేఖర్ రెడ్డి, నిమ్మర్తి మల్లికార్జున, నాగేంద్ర, ఎరుకలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ స్థల ఆక్రమణల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న జేసీ శివనారాయణ శర్మ

పామిడి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థల ఆక్రమణలను సోమవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పరిశీలించారు. ఆర్టీసీ ఆర్‌ఎం, డీఎంలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు ఆక్రమణల తొలగింపు నివారణకు ప్రహరీ నిర్మించుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కాగా.. స్థల ఆక్రమణలపై సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.రహీమ్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

- నాలుగు నెలలుగా స్టోర్లకు సరఫరా కాని కందిపప్పు
- మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.130 పైనే
- అవస్థలు పడుతున్న రేషన్ కార్డుదారులు

కందిపప్పు ఉడకట్లే..

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీకి మంగళం పాడిందా అంటే.. అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. వరుసగా నాలుగు నెలలుగా కందిపప్పును స్టోర్లకు సరఫరా చేయలేదు. అంతకుముందు కొన్ని మండలాలకు ఒక నెల మిగిలిన మండలాలకు మరో నెల చొప్పున కందిపప్పు పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం.. నేడు అసలుకే ఎగనామం పెట్టింది. కందిపప్పు లేకుండానే స్టోర్‌లలో బియ్యం, చక్కెర, జొన్నలతో సరిపెడుతోంది. స్టోర్‌లలో కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో కార్డుదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో రేషన్ స్టోర్‌లలో కందిపప్పుకు పూర్తిగా మంగళం పాడుతారేమో అని రేషన్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి ప్రాంతంలో 1,09,538 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెల దాదాపు 11 టన్నుల కందిపప్పును తాడిపత్రి ప్రాంతపు కార్డుదారులు కోల్పోతున్నారు. వాటిలో తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతంలో 93 డీలర్ల పరిధిలో 45,615 రేషన్ కార్డులు, పుట్లూరు మండలంలో 11,472 కార్డులు, యల్లనూరు మండలంలో 11,059 కార్డులు, పెద్దపప్పూరు మండలంలో 10,765 కార్డులు, యాడికి మండలంలో 16,247 కార్డులు, పెద్దవడుగూరు మండలంలో 14,380 కార్డులు ఉన్నాయి.

ప్రతి నెలా రూ.72.29 లక్షల ఆదా..

కూటమి ప్రభుత్వం కందిపప్పును సరఫరా చేయకపోవడంతో ప్రతి నెలా రూ.72.29 లక్షలు ఆదా అవుతున్నాయి. నాలుగు నెలలుగా కందిపప్పు ద్వారా సుమారు రూ.2.90 కోట్లను ఆదా చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు కిలో ధర రూ.130 పైమాటే. అంటే నెలకు ఒక్కో కార్డుదారుడు కిలోకు రూ.66 అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి కూటమి సర్కార్ కందిపప్పు సరఫరాను నిలిపివేసింది. మార్కెట్‌లో కందిపప్పు ధర మండుతోంది. పేద, మధ్య తరగతి ప్రజలు వంటల్లో ఎక్కువగా కందిపప్పును ఉపయోగిస్తుంటారు. స్టోర్‌ల్లో కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.


కందపప్పు ప్యాకెట్లు

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం..

2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజలే దేవుళ్లని వారికి రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. పౌరసరఫరాల శాఖలో చోటుచేసుకున్న అక్రమాలు, తక్కువ తుకాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని రోజుల పాటు కందిపప్పు పంపిణీని నిలుపుదల చేస్తున్నామని మంత్రి నాదేండ్ల మనోహర్ ప్రకటించారు. అప్పట్లో ఇది నిజమనుకున్న అమాయకపు పేద ప్రజలు తరువాత కూటమి దుష్ట పన్నాగం తెలిసి మండిపడుతున్నారు. ప్రస్తుతం కందిపప్పు పంపిణీని పూర్తిగా ఆపేసి పేదలను దగా చేస్తోంది.

సరఫరా కాలేదు



పౌరసరఫరాల శాఖ నుంచి కందిపప్పు సరఫరా జరగలేదు. కందిపప్పు వచ్చిన వెంటనే స్టోర్‌లకు సరఫరా చేస్తాం. కందిపప్పును కార్డుదారులు అడుగుతున్నారని డీలర్లు తన దృష్టికి తీసుకువచ్చారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేస్తే స్టోర్‌లకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీరాములు, తాడిపత్రి రైస్ గోడౌన్ ఇన్‌చార్జ్

నేడు వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి

గార్లదిన్నె/బుక్కరాయసముద్రం/యాడికి: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి మంగళవారం జరగనుంది. గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, యాడికిలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని ఆయా మండలాల కన్వీనర్లు ఎల్లారెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సంజీవరాయుడు తెలిపారు. గార్లదిన్నె, బుక్కరాయసముద్రంలో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ హాజరుకానున్నారు.

బాధ్యతల స్వీకరణ

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఈఓఆర్డీ శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓఆర్డీగా పని చేస్తున్న జిలాన్ బాషా ఎంపీడీఓగా పదోన్నతిపై వెళ్లడంతో ఆయన స్థానంలో శివప్రసాద్‌ను నియమించారు. శివప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు.

కూటమి అరాచకాలపై పోరాడదాం

గుంతకల్లుటౌన్: జనరంజక పాలనను అందించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి లక్ష్యం కావాలని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులుకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైవీఆర్ మాట్లాడుతూ.. కష్టపడి పని చేసే వారిని పార్టీ తప్పనిసరిగా గుర్తిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మన్నవ గ్రామ దళిత సర్పంచ్ నాగమల్లేశ్వరరావును పట్టపగలే కొట్టి చంపే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో హెచ్చుమీరిన దౌర్జన్యాలు, మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు, ప్రజలకు ప్రభుత్వం చేసిన మోసాలు, స్థానిక ప్రజాసమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అంకితభావం, నిబద్ధతతో పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జింకల రామాంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మాజీ సీఎం వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షుడు అనంత, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైవీఆర్, జింకల రామాంజనేయులును ఎస్సీ విభాగం నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, కౌన్సిలర్లు లింగన్న, చాంద్‌బాషా, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వీరేష్, పట్టణ అధ్యక్షుడు నల్లప్ప, పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎంఎం.రెహమాన్, బూత్ కమిటీ కన్వీనర్ జన్నే మస్తాన్, మాజీ కౌన్సిలర్ పాండు, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎల్లప్ప, పరుశురాముడు, సీనియర్ నాయకులు నూర్‌నిజామీ, ఆర్‌డీజీ బాషా, గోవింద్ నాయక్, జయరామి రెడ్డి, సోమిరెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్‌బాసిద్, షాబుద్దీన్, పార్టీ పట్టణ కార్యదర్శులు తిమ్మప్ప, కరీమ్, ఉపాధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామాంజనేయులును సన్మానిస్తున్న నాయకులు

'మా వారి ఆచూకీ తెలపండి'

తాడిపత్రి టౌన్: తాడిపత్రి కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆచూకీ చెప్పాలని బాధిత కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులను ప్రశ్నిస్తున్నారు. వివరాలు.. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశు, వెంకటనారాయణ, రంగనాయకులు, బాలరంగ స్వామి, గంపయ్య, రామచంద్ర గత సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామంలో జరిగిన ఘర్షణ కేసులో సోమవారం తాడిపత్రి కోర్టుకు వచ్చారు. కోర్టు కేసు వాయిదా వేయడంతో కోర్టు నుంచి బయటకు వచ్చిన వారిని ఓ ప్రవేట్ వాహనంలో పోలీసులు అనంతపురం వైపు తీసుకెళ్లారని బాధిత బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులు తమకేమి తెలియదని చెబుతున్నారు. తాడిపత్రి ఎస్‌ఐ గౌస్‌బాషాను సంప్రదించగా.. తాడిపత్రి కోర్టుకు వచ్చిన వారిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసేందుకు సిద్ధ పడుతుండటంతో వారిని పెద్దపప్పూరు పోలీసులకు అప్పగించామన్నారు. పెద్దపప్పూరు ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ వివరణ ఇస్తూ.. వరదాయపల్లికి చెందిన వేరే వ్యక్తులు మా దగ్గర వున్నారని.. కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన వారు మా వద్ద లేరని చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆరుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు మాయం చేసి ఆచూకీ తెలియదని చెబుతుండటంతో గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఉంటే చట్ట ప్రకారం నడుచుకోవాలి అని.. ఇలాంటి చర్యలు తీసుకోవడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పప్పుల ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఉన్న పప్పుల ఫ్యాక్టరీ పక్కన ఉన్న కర్రలకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో దాదాపు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని కిషోర్ తెలిపారు.

హిందూ శ్మశాన వాటికలో హోమం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో సోమవారం హోమం జరిగింది. హిందూ శ్మశాన వాటిక పునరుద్ధరణలో భాగంగా సామాధులను హిటాచీల సాయంతో తొలగించారు. భూమిలో నుంచి బయటపడ్డ అస్థికలను గుట్టగా పోసి కాశీ నుంచి రప్పించిన నాగసాధువులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అస్థికలను దహనం చేసి బూడిదను కాశీలోని గంగానదిలో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా అర్చకులతో హోమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని సీఐ సాయి ప్రసాద్ అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,085 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ బాషా సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పంపిణీ


మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి

తాడిపత్రి రూరల్: స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పని చేస్తున్న 29 మంది మెప్మా ఆర్పీలకు సోమవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెప్మా ఆర్పీలు మరింత పారదర్శకంగా పని చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేసిందని తెలిపారు.

జిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా విజయలక్ష్మి

గుంతకల్లుటౌన్: ఎఫ్‌సీఐ రాష్ట్ర కన్సల్టేటివ్ కమిటీ

సంక్షిప్త సమాచారం

సభ్యురాలిగా కొనసాగుతున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి జిల్లా పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మిని ఎఫ్‌సీఐ హమాలీలు, పలువురు బీజేపీ కార్యకర్తలు కలిసి సన్మానించారు.

జనసేనలో భగ్గుమన్న విభేదాలు

గుంతకల్లు: పట్టణ జనసేన పార్టీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. గుంతకల్లు నియోజకవర్గ బాధ్యుడు అని చెప్పుకునే వాసగిరి మణికంఠ వ్యవహార శైలితో జనసేన పార్టీ పూర్తిగా భ్రష్టు పట్టిందని జనసేన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఓ కార్యాలయంలో విజయజ్యోతి, వక్కల ఉమ తదితరులు మాట్లాడారు. మణికంఠ స్వార్థ కోసం పార్టీని రెండు వర్గాల చీల్చారన్నారు. వ్యవహార శైలిపై ఆహుడా చైర్మన్ టీసీ వరుణ్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. గోబ్యాక్ మణికంఠ అంటూ హెచ్చరించారు.

ఆటోకు నిప్పు

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని పులగుట్టపల్లి పెద్ద తండాలో తుకారం నాయక్‌కు చెందిన ఆటోకు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు తుకారంను లేపి, మంటలను ఆర్పి వేశారు. మంటల్లో ఆటో సీట్లు, పైభాగం పూర్తిగా కాలిపోవడంతో దాదాపు రూ.40 వేలకు పైగా నష్టం వాటిల్లింది. కుటుంబ పోషణ కోసం 5 సంవత్సరాల క్రితం రూ.2.5 లక్షలతో ఆటోను కొనుగోలు చేసినట్లు తుకారం తెలిపాడు. సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని చెరువు కట్ట వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. గుంతకల్లుకు చెందిన శ్రీనివాసులు, రామకృష్ణ వ్యక్తిగత పనిమీద గుత్తికి వచ్చి.. తిరిగి వెళుతున్న సమయంలో చెరువు కట్ట వద్ద బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డారు. ఈ ఘటనలో శ్రీనివాసులు, రామకృష్ణ గాయపడ్డారు. గమనించిన స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తిమ్మంపేట వద్ద ఇద్దరికి..

గార్లదిన్నె: మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. సోములదొడ్డికి చెందిన అంజి అనే యువకుడు ద్విచక్ర వాహనంలో గుంతకల్లుకు వెళ్లి అక్కడ పీర్ల పండుగ చూసుకుని బంధువైన సురేంద్రతో కలసి ద్విచక్ర వాహనంలో సాములదొడ్డికి బయలుదేరాడు. తిమ్మంపేటకు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో గాయపడిన సురేంద్ర, అంజిని స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

న్యాక్ గ్రేడ్ గడువు పొడిగింపు

గుంతకల్లు: పట్టణంలోని శ్రీశంకరానంద గిరిస్వామి డిగ్రీ కళాశాల న్యాక్ గ్రేడ్ గడువు మరో 5 ఏళ్లు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు కరస్పాండెంట్ కేసీ హరి, చైర్మెన్ మురళీకృష్ణ తెలిపారు. న్యాక్ గ్రేడ్‌ను మరో ఐదేళ్ల పాటు పెంచుతూ న్యాక్ కార్యాలయం నుంచి ఈ-మెయిల్ ద్వారా పొడగింపు ఉత్తర్వులు అందినట్లు వివరించారు. న్యాక్ గుర్తింపు రావడానికి సహకారం అందించిన అధ్యాపకుడు డాక్టర్ నటరాజ్‌ను సత్కారించారు.

రస్తా పునరుద్ధరించాలి

పామిడి: రస్తాను పునరుద్ధరించాలని మండలంలోని రామగిరి ఎగువ తండా గిరిజనులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పొలాలకు వెళ్లేందుకు రస్తాను కొందరు అగ్రవర్ణాల వారు ఆక్రమించుకుని దారి లేకుండా చేశారన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటినా అక్కడకు చేరుకొని నిరసన కారులను పోలీసుస్టేషన్‌కు తరలించారు.


తాడిపత్రి రూరల్: ఊరుచింతలలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


గుత్తి: బారే హిమామ్ పీర్ల ఊరేగింపు


పామిడి: పీర్లస్వాముల చివరి దర్శనం


యాడికి మండలం చందనలో పెద్దపీరును ఊరేగిస్తున్న దృశ్యం


శింగనమల: పీర్లను జలధికి తీసుకెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

గుత్తి/తాడిపత్రి రూరల్/శింగనమల/తాడిపత్రి టౌన్/యల్లనూరు/పామిడి/యాడికి/గార్లదిన్నె/బుక్కరాయసముద్రం: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సోమవారం మొహర్రం వేడుకలు జరిగాయి. తెల్లవారుజామున పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేయించారు. మేళతాళాలు, తప్పెట్లతో గ్రామోత్సవం నిర్వహించారు. పీర్లకు చక్కెర, బెల్లం, కొబ్బెర, చదివింపులు చేయించారు. భక్తులు పీర్లపైకి గంధం చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. యువత అగ్నిగుండం చుట్టూ అలావ్ తొక్కుతూ సందడి చేశారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. పీర్లకు ఏర్పాటు చేసిన గుండాలను తీసివేసి, గొడుగులు, దుస్తులను తల మీద పెట్టుకొని ఊరేగింపుగా చావిడి వద్దకు వచ్చారు.


తాడిపత్రి టౌన్: నందలపాడులో పీర్లకు గ్రామోత్సవం